

# అల్లరి పిల్లలు

## 1. జగడాలమారి జగ్గు

కొంతమంది పిల్లలు ఎప్పుడూ ఏదో ఒక విషయంమీద పక్కవాళ్ళతో జగడాలాడుతూనే ఉంటారు జగ్గూని చూడరాదూ తెలుస్తుంది వాడికి ఒకటే పంతం ఎంతసేపూ తనమాటే నెగ్గాలి అందరూ కలిసి దాగుడుమూతలు సరదాగా ఆడుకుంటూఉంటారను కోండి గుబులు తిరిగినట్లు, "ఈ ఆట ఆడవద్దు మనం రైలుబండి ఆట ఆడుకుందాం" అంటాడు అంతే వెంటనే తక్కినవాళ్ళందరూ ఇష్టం ఉండనీ లేకపోనీ, ఆ ఆట మానేసి రైలుబండి ఆటకి రావలసిందే లేకపోతేనా, అబ్బ! వాడి అల్లరి ఇక ఇంత, అంత అని చెప్పటానికి వీలు లేదు. కాళ్ళు దబదబ బాదటం, ఏడవటం - ఒకటికాదు

ఒకనాడింతే అయింది ఉమ దగ్గిరికివచ్చి "అదికాదు జగ్గూ! అంటే నీకు కోపంకాని, నీ యిష్టమేతప్ప ఒక్కసారయినా మామాట వినకూడదా ఏమిటి?" అని అడిగింది. ఇంతలో ఏమైందో ఏమిటో కాని జగ్గూ కూర్చున్నవాడు లేచి కేకలు మొదలుపెట్టాడు ఏ తేలో, పామో కరిచిందనుకొని అంతా గాభరా పడిపోయినారు. జగ్గూ వాళ్ళఅమ్మ ఈగోల భరించలేక గబగబ వచ్చి "ఏమైందిరా?" అని అడిగింది "చూడమ్మా! ఉమ వేలుతో నా కన్ను పొడిచింది" అని జగ్గూ చెప్పాడు.

"చూశావా? చూశావా? నేను కన్ను పొడిచానుట! ఎప్పుడురా జగ్గూ! నేనింతదూరంలోనుంచుంటే, నిన్ను తాకనైనా లేదుకదరా!" అని బిక్కమొహంపెట్టింది ఉమ తక్కిన పిల్లలంతా పాపం చూస్తూ నిలబడి పోయినారు జగ్గూవాళ్ళఅమ్మ కోపంగా విసుగుకోవటం మొదలు పెట్టింది "ఆడుకొనేవాళ్ళు సరిగ్గా ఆడుకోకూడదూ? ఆడుకున్నంత సేపూ ఆడుకోవటం - అక్కడినించి తన్నుకోవటం కాకిగోల అయి పోయింది" అంటూ ఆమె జగ్గూ చెవిపట్టుకొని మెలేసింది. "వెధవా! వాళ్ళతో ఆడుకోవటానికి పోవద్దని ఎన్నిసార్లు చెప్పాను నీకు? బుద్ధి లేదూ! ఇంకనెప్పుడూ వాళ్ళదగ్గరికి పోవుకదా!" జగ్గూ రాగాలు తీస్తూ "పోను, పోను" అని కేకలు పెట్టాడు.

ఇదంతాచూసేసరికి తక్కిన పిల్లలకి కళ్ళవెంబడి నీళ్ళు వచ్చినాయి గుప్‌చిప్‌గా వెళ్ళిపోయినారు ఉమ పాపం! తనవలనకదా ఇదంతా అయిందని మరింత బాధ పడింది "ఊరుకోవే! వాడి స్వభావమే అంత! నువ్వేం చేశావేమిటి? ఎప్పుడేమిటి వాడు జగడాలు తెచ్చి తన్నులు తినకుండా ఉన్నది!" అని ఓదార్చారు తక్కినవాళ్లు.

ఇలాంటివాడు జగ్గూ అంటే అయినదానికి కానిదానికి ఇలాగా యాగీచెయ్యటం, తాను దెబ్బలు తినటం, తక్కినవాళ్ళందరికీ మాట తేవటం ఇటువంటివాడికి బుద్ధి ఎలా వస్తుంది?

ఒకసారి భలే తమాషా జరిగింది ఉగాదిపండగ ముందు జగ్గూ పిన్నిగారి ఊరు వెళ్లాడు వెళ్లే ముందు జగ్గూవాళ్ళఅమ్మ మరీ మరీ చెప్పింది - వెళ్లినచోట బుద్ధిగా ఉండమని పిన్నికి ఒక కొడుకు ఉన్నాడు వాడిపేరు మనోహరు అంతా 'మనూ' అంటారు మనూ జగ్గూకంటే ఒక ఏడాది చిన్నఅల్లరిలో మాత్రం జగ్గూని మించిన వాడు. మనూకి వేరే అన్నలు తమ్ముళ్లుగాని అక్కలు చెల్లెళ్ళు గాని లేరు అందుచేత వాడిని వాళ్ల అమ్మా, నాన్నా చాలా గారాబంగా చూస్తారు వాడు ఏమి చెప్పినా నమ్ముతారు.

జగ్గూ అక్కడికి వెళ్లినరోజున

మనూ వాడి బొమ్మసామాగ్రి అంతా చూపించాడు. వాడికి ఒక బొమ్మకారు ఉన్నది. ఆ కారు ఎక్కి కూర్చొని "నా కారు చెడిపోయిందంటూ - నువ్వేమో వెనకాలనించి కారు నెట్టు. నేను స్టార్టుచేస్తాను" అన్నాడు. జగ్గూకి పాపం! ఒకసారి ఆ కారుఎక్కి సరదాగా ఇల్లంతా తిరగాలని ఉన్నది. కాని ఏంచేస్తాడు? "సరే. నేను కొంచెంసేపు తోస్తాను. మరి ఆతరువాత నన్ను కారెక్కనిస్తావా?" అని అడిగాడు. "ముందు తొయ్యి" అన్నాడు మనూ హాయిగా కూర్చొని. జగ్గూ ఎంతసేపు నెట్టినా వాడు "కారు ఇంకా స్టార్టు కావటం లేదు. ఇంకా కొంచెంసేపు నెట్టు" అని అంటూ ఏడిపించాడు. జగ్గూకి ఉక్రోషం వచ్చింది. "నేను నెట్టను. ఏంచేస్తావో చెయ్యి" అన్నాడు. "సరేలే. అయితే ఈసారి నాకారు ముట్టుకో చెప్తా నీపని" అన్నాడు మనూ.

"ఏంచేస్తావేమిటి?" అని రెట్టించాడు జగ్గూ. మాటమీద మాట వచ్చి ఇద్దరూ కలియబడ్డారు.

"నేను కారు ముట్టుకుంటాను ఏంచేస్తావో చెయ్యి!" అని జగ్గూ విసురుగా కారుమీద చెయ్యివేసి నెట్టాడు. మనూకు కోపం వచ్చింది. మరి ఏడవాలంటే ఏదో వంక పెట్టుకోవాలిగా. కాలుతో కారు ఆపబోయినాడు. కాలిమీదుగా పోయింది. ఇకనేం? జగ్గూకూడా ఆశ్చర్యపోయేటట్లు ఏడుపు సాగించాడు. మనూ వాళ్లఅమ్మ పరుగెత్తుకొనివచ్చి "ఏంచేశావురా జగ్గూ. తమ్ముణ్ణి ఏంచేశావు చెప్పు." అని అడిగింది. "నేనేమీ చెయ్యలేదు పిన్నీ!" అని జగ్గూ చెప్తూ ఉండగానే మనూ అడ్డువచ్చి "ఏమీ చెయ్యలేదుట పాపం. చూడమ్మా కారు విసురుగా నా కాలిమీదుగా పోనిచ్చాడు. కాలంతా ఒకటే నొప్పి. చూడు" అంటూ మళ్లీ ఏడుపు కొనసాగించాడు. పిన్ని జగ్గూని ఏమీ అనలేక "తప్పకాదూ? తమ్ముణ్ణి ఏడిపించవచ్చునా? కలిసి ఆడుకోవాలిగాని." అన్నది. జగ్గూకి పట్టరాని కోపం వచ్చింది. కాని ఏం చేస్తాడు. తాను చేసిందేమీ చెప్పకుండా అంతా తనమీదికి తోసేశాడు మనూ.

ఇది మొదటిరోజున జరిగింది. ఆ తరువాత నాలుగురోజులలో ఇంతకంటె పెద్దపెద్ద కొలుపులు జరిగినాయి. ప్రతీ చిన్న విషయంలోను జగ్గూకి తలవంపు తప్పలేదు. పిన్ని చివరికి అన్నది "అమ్మయ్యో! ఏమో అనుకున్నాను. నువ్వు అల్లరి పిల్లడివని విన్నానుకాని ఇంత ఆకతాయి వనుకోలేదు. తమ్ముడితో కలిసి చక్కగా ఆడుకోలేవూ? ఈ జగడాలమారితనం ఎక్కడ నేర్చుకున్నావు?"

జగ్గూకి ఏడుపు వచ్చింది. కాని తనమాట వినేదెవరు? పండగ వెళ్లిన మరునాడే గోలచేసి ఇంటికి వచ్చేశాడు. రాగానే ఉమ, తక్కిన వాళ్లు ఎదురొచ్చారు.

"మనూ ఎంత అల్లరివాడనుకున్నా? ప్రతిదానికి ఏడుస్తాడు. నేనేమీ చెయ్యనిదే నామీద ఎన్నో పితూరీలు చెప్పాడు." అని చెప్పాడు జగ్గూ సావాసగాళ్లతో. ఉమ బదులుచెప్పింది. "నువ్వు మాత్రం బుద్ధిమంతుడివా ఏమిటి? మమ్మల్ని అందరిని ఎలా ఏడిపించావో ఇప్పటికైనా తెలిసి వచ్చిందా?"

ఈమాటలు విని జగ్గూ మొదట గింజుకున్నాడు. కాని ఇంటికి వెళ్ళి కమ్మగా కడుపునిండా భోజనంచేసి పడుకున్నతరువాత ఆలోచిస్తే, అప్పుడు అర్థమైంది ఉమ చెప్పిన దాంట్లో నిజం. "ఇక నెప్పుడూ అలా ఉండను నేను" అనుకున్నాడు.

అనుకోవటానికయితే అనుకున్నాడుకాని మరి అలా ఉంటాడా లేదా అన్నదే ప్రశ్న. జగడాలమారి జగ్గూ మంచివాడవుతాడో లేదో చూద్దాం!

—ముపి..

హకల్ బెరిపిన్
వెల: రు. 2-0-0 లు.
పోష్టుఖర్చులు అదనము.



కొత్తగా ప్రవేశపెట్టబడినవి
అందము; పటిష్టముగల ఉక్కు కుర్చీలు సరసమైన ధరలో కొనుటకు మమ్ము సంప్రదించండి.
వివరములకు నేడే వ్రాయండి:
లల్లూరాం అండ్ కో,
వలగలేటివారి వీధి, విజయవాడ - 1.
"శాంతి షోరూమ్ - మారుతి సినిమా ఎదురుగా."